జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 1-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 441 పేజీలు: 4 వెల : రూ.7

## డీఆర్డీఏలో మరో అవినీతి..
# గుట్టురట్టు





శ్రీకాకుళం, ఆగస్టు 31(వార్త): జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలో కుంభకోణాలు వరుసగా బయట పడుతున్నాయి. ఇప్పటి వరకు కోటి రూపాయల కుంభకోణంపై చర్చ కొనసాగుతుంటే, తాజాగా మరో సంచలన అంశం వెలుగులోకి వచ్చింది. డీఆర్‌డీఏలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, హెచ్‌ఆర్, ఫైనాన్స్‌గా పని చేస్తున్న రఘు పాత్రుని హేమసుందర్ తన పదవిని దుర్వినియోగం చేస్తూ, తన కుటుంబ సభ్యుల పేర్లతో 'ఆర్‌కే ఏజెన్సీ'ని రహస్యంగా ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ ఏజెన్సీ పేరుతో, ప్రింటింగ్ మెటీరియల్, లెటర్‌హెడ్స్, కంప్యూటర్లు, ప్రింటర్లు, ఆఫీస్ సామాగ్రి, పేపర్లు మొదలైన వాటిని ఎటువంటి టెండర్లు లేకుండా డైరెక్ట్‌గా సరఫరా చేసి బిల్లులు వేశాడు. దీంతో పెద్దఎత్తున ప్రభుత్వ నిధులు మళ్లించబడ్డాయి. అంతేకాకుండా, ఈ సరఫరాలపై జీఎస్టీ చెల్లించకుండానే నిధులను ఆర్‌కే ఏజెన్సీ ఖాతాకు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కోట్ల రూపాయల పన్ను ఆదాయం కోల్పోయినట్టు లెక్కలు చెబుతున్నాయి. డిఆర్డిఏకి సంబంధించిన అన్ని స్టేషనరీ సరఫరాలు ఈ ఒక్క ఏజెన్సీ ద్వారా జరగడం, దీనికి వెనక ఉన్న అధికార వర్గాల ఆశీర్వాదం లేకపోతే సాధ్యమేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రజా డబ్బులు అధికారుల స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ ఇలా ఏజెన్సీలు ఏర్పరచుకోవడం, నిధులను మాయం చేయడం, టెండర్లను పట్టించుకోకపోవడం.. ఇలా శాఖలో మరిన్ని పెద్ద పెద్ద అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఒక్కొక్క అవినీతి బాంబు పేలుతుండడంతో ఆ శాఖలో కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నారు. ఏరోజు ఎటువంటి అక్రమాల బండారం బయటపడుతుందో, ఎవరిపై వేటు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.


R.K.Agencies
PRESIDENT, ZILLA MAHILA SAMAKHYA
SRIKAKULAM
Total Amount 17550.00
Round off (+/-) 17550.00
In words Rupees Seventeen Thousand Five Hundred Fifty Only

* టెండర్లు లేకుండా కోట్ల రూపాయలు విడుదల
* జీఎస్టీ చెల్లింపుల్లేకుండా నిధుల మాయం
* ఒకే ఏజెన్సీకి డీఆర్డీఏ మొత్తం స్టేషనరీ కాంట్రాక్టులు
* ప్రజా డబ్బుతో స్వార్థపరుల గోల్‌మాల్
* అధికార వర్గాల ఆశీర్వాదం లేకుండా సాధ్యమా?
* చిన్న ఉద్యోగి పేరుతో పెద్ద అవినీతి
* ప్రభుత్వానికి పన్ను ఆదాయం గాలిలో
* రోజుకో బండారం వెలుగులోకి

## వీఆర్‌కు.. కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు

* ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 31 (వార్త): కొత్తూరు ఎస్ఐ అలీ మహమ్మద్, హిరమండలం ఎస్ఐ మహ్మద్ యాసిన్లకు వీఆర్‌కు పంపుతూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై అవినీతి ఆరోపణలు, శాంతిభద్రతల్లో వైఫల్యం, తదితర ఆరోపణలు రావడంతో ఈ చర్యకు ఎస్పీ పాల్పడినట్టు సమాచారం. ఈ రెండు పోలీస్‌స్టేషన్లకు ఎస్ఐలుగా ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా, ఇద్దరు ఎస్ఐలపై వేటు పడినట్టు సమాచారం తెలుసుకున్న మరికొందరు ఎస్ఐలు, పోలీసులు ఒక్కసారి బెంబేలెత్తిపోయారు. ఎవరిపై ఎప్పుడు వేటు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

## మండల విద్యాశాఖలో..
# అడుగడుగునా నిర్లక్ష్యం

* నేటికీ పూర్తిస్థాయిలో పాఠశాలలకు అందని విద్యామిత్ర కిట్లు
* అరకొరగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
* తల్లిదండ్రులతో నెలవారీ సమావేశాలు ఊసేలేదు
* ఎంఈవోల మధ్య కొరవడిన సమన్వయం
* ఎంఆర్‌సీలో ముఖ్యమైన దినోత్సవాలు నిర్వహించని వైనం
* గ్రాంట్ ఏమవుతుందోనని కొందరు విమర్శలు

ఎల్ఎన్‌పేట, ఆగస్టు 31 (వార్త): మండలంలో విద్యా మిత్ర కిట్ల కొరత ఉంది. అలాగే అసెస్మెంట్ పుస్తకాలు నేటికీ పూర్తిగా అందలేదు. పాఠశాల స్థాయిలో కిట్లు కొరత ఉన్నప్పటికీ మండలం మొత్తంగా మిగులు కిట్లు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అలాగని మిగులు కిట్లు జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి అందించలేదు. అన్నింటా మండల విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండున్నర నెలలు గడుస్తున్నా ఒక్క మెగా పేరెంటు సమావేశానికి ముందు తప్ప ఒక నెల వారీ సమీక్షా సమావేశం జరపలేదు. ఇక ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం అయితే ఇక్కడ ఉపాధ్యాయులు పూర్తిగా మర్చిపోయారు. సమావేశాలు ఏర్పాటు చేస్తే ఉపాధ్యాయులు ఎక్కడ నిలదీస్తారో అని లక్ష్మీనర్సుపేట మండలంలో ఎంఈఓలు అసలు సమావేశాలు నిర్వహించడం లేదని మండలంలో ఉపాధ్యాయులంతా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మండలాన్ని అంతటినీ సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాల్సిన మండల విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయం లేదన్న విమర్శలు ఉన్నాయి. చివరికి పరీక్షా ప్రశ్నాపత్రాలు కూడా పాఠశాల పాయింట్ వద్దకు చేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లు పలువురు ఉపాధ్యాయులు అనుకుంటున్నారు. మండలంలో ఒక పాఠశాల నుండి సరిపడా ప్రశ్న పత్రాలు పరీక్ష సమయానికి అందలేదంటూ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారంటే ఇక్కడ సమస్య తీవ్రత ఎలా ఉందో తెలుస్తుంది. మండలంలో గిడుగు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం రోజున మండల విద్యాశాఖ కార్యాలయంలో అసలు తెలుగు భాష దినోత్సవం వేడుకలు జరపలేదని సిబ్బందే చెబుతున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు కూడా లక్ష్మీనర్సుపేట మండల విద్యాశాఖ కార్యాలయం నిర్వహించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. సొంత కార్యాలయం లేకపోయినంత మాత్రాన స్వాతంత్ర దినోత్సవ వేడుకలు చేసుకోలేదని కొందరు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఎంఆర్‌సీకి వస్తున్న గ్రాంట్ ఏం అవుతుందో ఎవరికీ తెలియడం లేదని మండలంలోని పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.


## రౌడీ షీటర్లకు
# కౌన్సెలింగ్

శ్రీకాకుళం, ఆగస్టు31 (వార్త): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లాలో గల రౌడీ షీటర్లలకు పోలీసు అధికారులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా పట్టణ కేంద్రంగా ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై హరికృష్ణతో పాటు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, చెడు నడతగలవారిని పోలీస్ అధికారులు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## చెక్‌పోస్ట్ పూర్వ ఉద్యోగికి సన్మానం

**ఇచ్ఛాపురం, ఆగస్టు31(వార్త):** గతంలో పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌లో పనిచేసి శ్రీకాకుళంలో ప్రస్తుతం పని చేస్తున్న వీవీ సత్యనారాయణ( డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కమర్షియల్ డిపార్ట్మెంట్)పదవి విరమణ చేశారు. ఇచ్ఛాపురంలో కమర్షియల్ డిపార్ట్మెంట్లో సేవలందించిన సత్యనారాయణను స్వర్ణ భారతి విద్యాసంస్థలు చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, కొచ్చర్ లక్ష్మణ్ రెడ్డి, జీరు లోహిదాస్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# విధుల్లో ఆమె అరుణోదయం

*** ఘనంగా అరుణశ్రీ ఉద్యోగ విరమణ * సన్మానించిన నాయకులు, స్థానికులు, సంఘాలు**

**మందస, ఆగస్టు 31(వార్త):** ఆదర్శ దంపతులుగా పేరు తెచ్చుకున్న పైల కృష్ణప్రసాద్, అరుణశ్రీ దంపతులు ఉపాధ్యాయులు. కృష్ణప్రసాద్ ఎంఈఓగా పని చేస్తూ.. రిటైర్మెంట్ పొందారు. కాగా, ఆయన సతీమణి యవ్వారి అరుణశ్రీ మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ.. ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో అరుణశ్రీకి ఘన సన్మానం చేశారు. కృష్ణప్రసాద్, అరుణశ్రీ దంపతులకు నాయకులు, స్థానికులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీతో గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం అభినందన సభ జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అరుణశ్రీ విధుల్లో చూపిన అంకితభావం, కృషి, పట్టుదలను కొనియాడారు. వృత్తినే దైవంగా భావించి, విధి నిర్వహణలో విశిష్టమైన సేవలను అందించి.. విద్యార్థుల భవిష్యత్ కోసం ఎంతగానో



కృషి చేశారని ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి, అందరి మన్ననలు పొందిన అరుణశ్రీ సేవలను కొనియాడారు. సమాజసేవలో కృష్ణప్రసాద్, అరుణశ్రీ చేస్తున్న సేవలు, నేత్రదానాలపై వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ ప్రతినిధి రాపాక శేషగిరిరావు, దాసరి తాతారావు, నారాయణ దొర విద్యా సంస్థల అధిపతి హనుమంతు వెంకటరావు, మాజీ జెడ్పీటీసీ అందాల శేషగిరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సొర్ర ఢిల్లీ రావు, మందస మండల ఎంఈఓ ఎం.లక్ష్మణరావు, పలాస మండల ఎంఈఓ సీహెచ్ శ్రీనివాసరావు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. లొహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తూ.. పూర్వపు మండల విద్యాశాఖ అధికారి పైల కృష్ణ ప్రసాద్ సతీమణి యవ్వారి అరుణశ్రీ పదవీ విరమణ చేసిన సందర్భంగా యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. లొహరిబంద ఉన్నత పాఠశాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది, విద్యార్థులకు చక్కనైన విద్యను అందించుటలో ఎనలేని సేవలు అందించారన్నారు. ఆమె సేవలకు గుర్తించి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో పాటు శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు.





## 14న హిందీ దినోత్సవం

**పలాస, ఆగస్టు 31 (వార్త):** హిందీ దినోత్సవాన్ని ఈనెల 14న ఘనంగా నిర్వహించనున్నామని ఫోరం సభ్యులు తెలిపారు. వేడుకలకు సంబంధించిన సన్నాహక సమావేశం ఆదివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందీ ఫోరం సభ్యులు సంతోష్, కిరణ్, భానుమూర్తి, జగన్, సూర్యలు హాజరై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలాస- కాశీబుగ్గ హిందీ ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, శ్రీనివాస్ బాబ్జీ, విష్ణు, చిన్నారావు, సీతారాం, కల్పన, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ




**వీరఘట్టం, ఆగస్టు31(వార్త):** ఫిట్ ఇండియా నినాదంతో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు వీరఘట్టం ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి పెట్రోల్ బంకు, ఓటిగెడ్డ వంతెన వరకు ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులకు వ్యాయామం అవసరమని, ఆ క్రమంలోనే సైకిల్ ర్యాలీ చేశామని తెలిపారు. వ్యాయామంతో ఆరోగ్యం కూడా ఎంతో నిలకడగా ఉంటుందన్నారు. ఇదే విధానాన్ని ప్రజలు కూడా పాటిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, హెూంగార్డులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దక్కత కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 31 (వార్త):** దివంగత మాజీ ఎమ్మెల్యే దక్కత అచ్యుతరామయ్య రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కన్నుమూశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాలం అశోక్ పరామర్శించారు. స్వగ్రామం బిరలంగి తోటూరు లో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏకాంబరి, గిరిలను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీ రావు, మెరుగు సూర్యనారాయణ, పేదిని బాబ్జి, ఆసి లీలా రాణి, కామేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వంశధార సాగునీరు సాధన కమిటీ పర్యటన

**మందస, ఆగస్టు 31(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు మందస మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పిడిమందస, దేవుపురం, మహదేవుపురం, నర్సింగపురం, చత్రపురం గ్రామాల్లో పర్యటించి, గ్రామ పంచాయతీ తీర్మానం కాపీలు, పోస్ట్ కార్డులను రైతుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, దుంపల వైకుంఠరావు, మజ్జి బాబురావు, ఉగ్రిపిల్లి సోమనాదం, దేవాడ నారాయణ, కొవ్వూరు దశరధిలు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి వంశధార సాగునీటి ఆవశ్యకతను వివరించారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడానికి దోహదపడుతుందన్నారు. మరో ఉద్యమంతో సాగునీరు సాధించగలమన్నారు. కార్యక్రమంలో పిడిమందస సర్పంచ్ సేనాపతి ఉమామహేశ్వరరావు, ఉప్పాడ రాజారావు, రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### కాళీమాత సేవా సమితి

## ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం, ఆగస్టు31(వార్త):** సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన సూరి శ్యాంసుందర్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మరణించారు. ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేక ఇబ్బందులు పడుతున్న భార్య, పిల్లల విషయం తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సేవా కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పాల్గొన్నారు.




### ఎరువుల పంపిణీలో...

## వ్యవసాయాధికారులు విఫలం

*** యూరియా కోసం గంటల తరబడి రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు * ప్రైవేట్ వ్యాపారులతో ములాఖాత్ * కొందరు అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 31(వార్త):** మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు సేవా కేంద్రాల్లో అధికారులు నచ్చిన వారికి ఎరువులు అందజేశారని దీనివలన ప్రైవేటు ఎరువుల దుకాణాలు వద్ద పడిగాపులు కాసి అధిక రేట్లతో పాటు, అదనపు ఎరువులు జోడించి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండవలసిన యూరియా పక్కదోవ పడుతుందని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సచివాలయ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద స్టాక్ ఉన్నా ఎరువులు కూడా పంపిణీ చేయకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు అంటున్నారు. ఏదో ఒక రైతు సేవా కేంద్రానికి లోడు యూరియా వస్తే 400 మంది రైతులు అవసరం కాగా 200 మందికి సరిపోయిన యూరియా సరఫరా చేస్తున్నారు. మిగతా యూరియా ఏం చేస్తున్నారు అనేది ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉందని రైతులు విమర్శిస్తున్నారు. వ్యవసాయ అధికారులు రైతుల కష్టాలు కనీసం పట్టించుకోవడం లేదు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం లేదని రైతులు బహిరంగంగానే చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులు అన్యాయం జరిగినా, ఎరువులు బ్లాక్‌లో విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి రైతులు రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సూపర్ సిక్స్.. హామీలను నెరవేరుస్తున్నాం

*** ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, ఆగస్టు 31(వార్త):** సూపర్ సిక్స్ హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస టీడీపీ కార్యాలయంలో స్త్రీ శక్తి పథకం విజయోత్సవ ఆదివారం భారీగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని గతంలో పాలించి సర్వనాశనం చేశారన్నారు. నేడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పవన్ కళ్యాణ్ సహకారంతో నరేంద్ర మోడీ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్నిర్మాణ కార్యక్రమం చేపడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. నాడు అన్న ఎన్టీ రామారావు ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని, విద్య ఉద్యోగ రాజకీయాలలో 30 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి మన చంద్రబాబు నాయుడు ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించడానికి డ్వాక్రా వ్యవస్థను సృష్టించారన్నారు. అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే ఇస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదు



రకాల ఆర్టీసీ బస్సులలో రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే స్త్రీ శక్తి పథకాన్ని గతనెల 15న ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పీరుకట్ల విటల్, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, లోడగల కామేష్, కురిటి సూర్యనారాయణ, కూటం నేతలు రామానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగంలో ఏకాదశ రుద్ర పారాయణ యాగం

**జలుమూరు, ఆగస్టు 31 (వార్త):** శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సత్య సాయి సంస్థల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్ర పారాయణ యాగం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని మాట్లాడారు. లోక కళ్యాణం శాంతి సమాధాన సమాహారం అని చెబుతూ సత్యసాయి సంస్థలు శ్రీకాకుళం జిల్లా మొత్తం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా శ్రీముఖలింగేశ్వర స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సంస్థల కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జై జై గణేశా

* ఉత్సాహంగా గణనాథునికి పూజలు
* మండపాల వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు
* మహిళలచే కుంకుమ పూజలు, అన్నదానాలు

## భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజలు

**శ్రీకాకుళం, ఆగస్టు 31 (వార్త):** శ్రీకాకుళం డెఫ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపం వద్ద సామూహిక కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.



## హరిపురంలో..

**మందస, ఆగస్టు 31(వార్త):** వినాయకచవితి నవరాత్రుల్లో భాగంగా హరిపురంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. హరిపురంలో ఓల్డ్ ఎన్హెచ్-5 రహదారిలో విఘ్నేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్టించి, తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు చేస్తున్నారు. వినాయకుని ఒడిలో బాలగణపతి కూర్చొన్నట్టు రూపొందించిన ఈ విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టు కుంటోంది. నవరాత్రుల్లో భాగంగా ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో నిర్వాహక కమిటీ చేస్తోంది. దీనిలో భాగంగా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతీ రోజూ తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందిస్తున్నారు. ఆటో యూనియన్ నాయకుడు మోర్తిక వెంకటరమణ విఘ్నేశ్వరుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏటా ఈ ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.



## భక్తులను ఆకట్టుకుంటున్న 'జగన్నాథ గణపతి'

**మందస, ఆగస్టు 31(వార్త):** ఒడిశా సంప్రదాయాలకు నెలవైన మందసలో పూరీ విఘ్నేశ్వరుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి ఆలయ జంక్షన్ లో గల పొందరవీధిలో భక్తులు, వినాయక ఉత్సవాల కమిటీ ఈ ఏడాది ప్రత్యేక విఘ్నేశ్వరుని తయారు చేయించారు. ఒడిశాలోని పూరీలో గల శ్రీజగన్నాథస్వామి విగ్రహాన్ని పోలిన వినాయకుని తయారు చేయించి ప్రతిష్టించారు. దీంతో పాటు మండపం కూడా పూరీ ఆలయాన్ని పోలిన విధంగా సెట్ వేశారు. ఎన్నడూలేని విధంగా భక్తులకు మండపం, విఘ్నేశ్వరుడు దర్శనమిస్తుండడంతో భక్తులు దర్శించుకుని, తన్మయత్వానికి లోనవుతున్నారు. గణేశుడు, జగన్నాథుడులను దర్శించుకున్న అనుభూతి చెందుతున్నారు. పొందరవీధిలో ప్రతీ ఏటా ఏదో ఒక ప్రత్యేకత కలిగిన విఘ్నేశ్వర విగ్రహం ఏర్పాటు చేసి, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. కాగా, ప్రతీ రోజూ మేళ, తాళాలతో వినాయకచవితి ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను మేళవించేలా.. నవరాత్రులను నిర్వహిస్తున్నారు. శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయంతో పాటు జూనియర్ కళాశాల, పలు ఆలయాలకు రహదారి కావడంతో భక్తులు జగన్నాథగణపతిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.



## విక్రమపురంలో అన్నదానం



**వీరఘట్టం, ఆగస్టు31 (వార్త):** విక్రమపురం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో విక్రమపురం గ్రామ ప్రజలతో పాటు కంబర, కంబర వలస, నడిమికెల్ల, కడకెల్ల, చిట్టపులివలస, నడుకూరు, కిమ్మి తదితర గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జంట పట్టణాల్లో అన్నదానం

**పలాస, ఆగస్టు 31, (వార్త):** గణపతి ఉత్సవాలు సందర్భంగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 19వ వార్డు సూదికొండ, కొండమ్మ తల్లి వీధిలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామి మండపం వద్ద అన్నప్రసాదాన్ని వైసీపీ పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బగాది సింహాచలం, సీపాన ఈశ్వరరావు, పిట్ట భాస్కరరావు, సీపాన శ్రీరాములు, సీపాన వాసు, దీర్ఘాసి గురయ్య, మల్ల ధర్మారావు, పైల మల్లేష్, కొంచాడ వేణుగోపాల్, గజ్జి మల్లేసు, వట్టికుల్లా చంద్రయ్య, బందాపు షణ్ముఖరావు, సురకాసుల కృష్ణ పాల్గొన్నారు.



## వినాయక లడ్డూను దక్కించుకున్న ఎంపీపీ దానయ్య

**మందస, ఆగస్టు 31(వార్త):** వినాయక చవితి ఉత్సవాల్లో విఘ్నేశ్వరుని చేతిలో లడ్డూను భక్తులు పవిత్రంగా భావిస్తారు. ఆ లడ్డూను ప్రస్తుతం గ్రామాల్లో వేలం పాట ద్వారా భక్తులకు అందిస్తున్నారు. దీనిలో భాగంగానే మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లిలో వినాయక చవితి ఉత్సవాల్లో లడ్డు వేలాం పాట బహడపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ పాటలో ఇదే గ్రామానికి చెందిన మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అత్యధికంగా రూ.22వేలకు విఘ్నేశ్వర లడ్డును దక్కించుకున్నారు. విఘ్నేశ్వర ప్రసాదాన్ని అతి పవిత్రంగా భావిస్తున్న భక్తులు వేలాం పాటలో దక్కించుకున్న అనంతరం ఎక్కువగా ప్రసాదం రూపంలో భక్తులు పంచిపెడతారు.



## అంతరాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీ విజేత హరిపురం

**ఇచ్ఛాపురం, ఆగస్టు31 (వార్త):** వరసిద్ధి వినాయక 55వ వార్షికోత్సవంలో భాగంగా అంత రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీలను ఒడిశా సవర దేవిపేట (పేటూరు)లో ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలో 50 గ్రూప్స్ పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.6,666, మెమంటోను గీతం హైస్కూల్ హరిపురం (మందసా మండలం), ద్వితీయ బహుమతి రూ.5,555ని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మందసా మండలం), తృతీయ బహుమతి రూ.4,444ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అర్ బెలగం(కవిటి) కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి ప్రతిభా పోటీలలో విద్యార్థులు పాల్గొనేటట్లు చేసిన ప్రతి పాఠశాల హెచ్ ఎంలకి, ఉపాధ్యాయులకి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## లక్ష పలికిన వినాయక లడ్డూ

**సరుబుజ్జిలి, ఆగస్టు 31(వార్త):** సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో లడ్డు వేలాం పాట ఆదివారం నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన తంగి రామక్రిష్ణ అత్యధికంగా లక్ష రూపాయలకు ఈ లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.



## చవితి మండపాలకు మున్సిపల్ విద్యుత్తు వాడకుండా చూడండి



**పలాస, ఆగస్టు 31(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో అన్ని సచివాలయంల పరిధిలోను ఏర్పాటు చేసి ఉన్న చవితి మండపాలకు మున్సిపల్ విద్యుత్తును వాడకుండా నిరోధించవలసిందిగా కమిషనర్ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం పురపాలక సంఘంలో విద్యుత్తు విభాగానికి సంబంధించిన అధికారులు, సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సమావేశాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం చవితి మండపాలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నదో, సదరు విద్యుత్‌ను పురపాలక సంఘ వీధి దీపాల లైన్ల నుండి కాకుండా మెయిన్ లైన్‌ల ద్వారా విద్యుత్ శాఖ సంబంధించిన లైన్ల ద్వారా మండపాలకు విద్యుత్ ను వాడేటట్లుగా చూడవలసిందిగా సిబ్బందికి సూచించారు. స్ట్రీట్ లైన్ నుండి చవితి మండపాలకు విద్యుత్ సరఫరా జరిగినట్లయితే వీధి దీపాల బిల్లులు చాలా ఎక్కువగా వచ్చి మున్సిపల్ నిధులకు ఇబ్బంది కలుగునని, కనుక సిబ్బంది అందరూ ప్రతి మండపాన్ని తనిఖీ చేసి వీధి దీపాల లైన్ల నుండి కాకుండా విద్యుత్ శాఖ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా అయినట్లుగా చూడవలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ విభాగానికి సంబంధించిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సన్యాసిపుట్టుగలో డాన్స్ పోటీలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు31 (వార్త):** సిద్ధి వినాయక మహోత్సవాలు సన్యాసిపుట్టుగ గ్రామం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి డాన్స్ బేబీ డాన్స్ కాంపిటీషన్స్ జరిగాయి. ఈ పోటీలలో శ్రీకాకుళం పలాస హరిపురం కవిటి ఇచ్ఛాపురం గ్రామాల నుంచి వచ్చిన కళాకారుల బృందం సోలో విభాగాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం, నాట్య కళాకారులు సాంప్రదాయ కూచిపూడి నాట్య ప్రదర్శనలో పాల్గొని ద్వితీయ బహుమతి 7వేల రూపాయలు పారితోషికం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శివతాండవ నృత్యరూపకం డమరుకం శివ శివ శంకర అనే పాటలకు ప్రదర్శన ఇచ్చారు మంత్రముగ్ధులైన కమిటీ వారు కళాకారులను అభినందిస్తూ మరో 2200 రూపాయలు ప్రత్యేకంగా బహుకరించారు. ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొన్న నాట్య గురువు మంగి దివ్య కె కుమార్ డి శిరిసా బి భవాని పి వర్షిత లు పాల్గొన్నారు నాట్య కళాకారులకు పోటీలకు జడ్జిలుగా వచ్చిన అతిథులు చేతుల మీద ప్రత్యేకంగా బహుమతి అందజేశారు. నాట్య కళాకారులకు అకాడమీ అధ్యక్షులు కె గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పీజీఆర్ఎస్ అర్జీల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయండి



**వీరఘట్టం, ఆగస్టు31 (వార్త):**ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీల వివరాలు మీ కోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలను సోమవారం స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామన్నారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జిఓవి డాట్ ఇన్ వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

# చిన్నయ్య కుటుంబం.. సరస్వతీ నిలయం!

* బనిశెట్టి చిన్నయ్య వారసులంతా ఉపాధ్యాయులే
* మరో కోడలుకు ఉపాధ్యాయ ఉద్యోగం
* హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

**మందస, ఆగస్టు 31(వార్త):** బనిశెట్టి చిన్నయ్య.. ఆయన పేరు తెలియని వారుండరు. ఉపాధ్యాయునిగా ఎంతో మంచి సేవలందించారు. ఎందరినో ఉత్తములుగా తీర్చిదిద్దారు. ఆదర్శ ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన శిష్యులు ఉన్నతులుగా ఎదిగారు. పది మందిని ఆదర్శంగా తీర్చిదిద్దుతునే.. చిన్నయ్య తన వారసులను కూడా సరస్వతీ పుత్రులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయునిగా మచ్చలేని జీవితం గడిపిన చిన్నయ్య.. తన కుమారులను కూడా ఉపాధ్యాయులుగానే మార్చారు. సమాజం గురువుతోనే మార్పు చెంది, విజ్ఞానంగా మారుతుందని నమ్మిన చిన్నయ్య కుమారులు, కోడళ్లను కూడా గురువులుగా తీర్చిదిద్దారు. వివరాలిలా ఉన్నాయి. మందస పట్టణానికి చెందిన బనిశెట్టి చిన్నయ్య సాధారణ దేవాంగ కుటుంబానికి చెందినవారు. దేవాంగుల్లో ఉద్యోగాలు తక్కువ. అంతేకాదు, ఉపాధ్యాయ ఉద్యోగం అంటే మరీ తక్కువేనని చెప్పవచ్చు. అటువంటి రోజుల్లో చిన్నయ్య ఎంతో కష్టపడి ఉపాధ్యాయునిగా జీవితం సాగించారు. విద్యార్థులకు చిన్నయ్య అంటే గౌరవం. ఎందుకంటే ఆయన తన పాఠంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చాలన్న తపన ఉండేది. దీంతో ఆయన ఎందరినో మంచి భవిష్యత్ తీరాలకు చేర్చారు. పవిత్రమైన గురుతర బాధ్యతను నెరవేర్చే ఉపాధ్యాయ వృత్తి ఎంతో మేలని భావించిన ఆయన తన ముగ్గురు కుమారులను కూడా ఉపాధ్యాయులను చేయడంలో విజయం సాధించారు. పెద్ద



కుమారుడు శివప్రసాద్ ఇచ్ఛాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకునిగా పని చేస్తున్నారు. రెండవ కుమారుడు హేమశంకర్ వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిజగన్నాథపురంలో ప్రధాన ఉపాధ్యాయులుగా పని చేస్తుండగా.. ఆయన భార్య విజయలక్ష్మి పలాస హైస్కూలులో తెలుగు టీచర్‌గా పని చేస్తున్నారు. చిన్నకుమారుడు శ్రీనివాసరావు మందస పట్టణంలోని బీసీ స్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆయన భార్య ద్రాక్షాయని కూడా టీచర్ ట్రైనింగ్ పొందారు. కాగా, శివప్రసాద్ భార్య సంతోషి కుమారి కూడా పట్టువదలకుండా 40ఏళ్ల వయస్సులో ఉద్యోగం పొందారు. కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తూ, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతునే ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం చిన్నయ్య ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసి, ఆధ్యాత్మికవేత్తగా గడుపుతున్నారు. చిన్నయ్య భార్య జయలక్ష్మి సాధారణ గృహిణి. కుటుంబ వారసత్వంగా వస్తున్న గురువు బాధ్యతను చివరకు సంతోషికుమారి కూడా నెరవేర్చడంతో చిన్నయ్య కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేయడం అభినందనీయం. ఓ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చిన్నయ్య తన వారసులు తాను ఆచరించిన గురుతర బాధ్యతనే ఎంచుకుని, గురువులుగా మారడంపై ఉప్పొంగుతున్నారు. ఎంతోమంచి ఉపాధ్యాయునిగా, వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న బనిశెట్టి చిన్నయ్య కుటుంబం సాధించిన ఘనత పట్ల స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.




## ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి

**శ్రీకాకుళం, ఆగస్టు31 (వార్త):** విధుల్లో చేరి చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని నూతనంగా నియామకమైన అంగన్‌వాడీ ఆయాలకు ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. నూతనంగా నియామకమైన అంగన్‌వాడీ ఆయాలకు నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఆదివారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీకి వచ్చే మహిళలకు, బాలింతలకు, చిన్నారులకు మంచి సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు ఉంగటి రమణ, టీడీపీ నాయకులు మైలపిల్లి నర్సింహమూర్తి, నాగేంద్రయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్‌ను వినియోగించుకోండి

నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రజల తాగునీటి సౌకర్యార్థం సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం లక్షలాది మంది ప్రయాణీకులు వచ్చే కాంప్లెక్స్ లో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ సిబ్బంది దీనిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ డీఎంతో మాట్లాడుతూ మహిళలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బస్సును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కొరికాన రవి కుమార్, నాయకులు పాండ్రంకి శంకర్, అంబటి రాజ్యలక్ష్మి, ఉంగటి రమణ, విస్సు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.







## తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పండి

**నరసన్నపేట/జలుమూరు, ఆగస్టు 31(వార్త):**నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరయ్యారు. ఆంధ్రుల మాతృభాషా అయిన తెలుగు భాషా ఎంతో ప్రఖ్యాతి కలిగిన ప్రాచీన భాషని ప్రపంచ నలు మూలల నుంచి ఎందరో మహానుభావులు చేత కీర్తించబడిన భాషని మన తెలుగు భాషని కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే అన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని నేటితరం యువతరానికి అందించాలన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రచయితలు వేదిక పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం బమ్మిడిపాటి గౌరీ శంకర్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రచయితల వేదిక వ్యవస్థాపకుడు సదాశివుని కృష్ణ, స్థానిక రచయితలు, కవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు

**సంతబొమ్మాళి, ఆగస్టు 31(వార్త):** సంతబొమ్మాళి మండల ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా చినతుంగాం పంచాయతీ కార్యదర్శి దుంప శ్రీనివాస రావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంతబొమ్మాళి డిప్యూటీ ఎంపీడీవో యు.సత్యన్నారాయణను గార డిప్యూటీ ఎంపీడీవోగా డిప్యూటేషన్‌పై నియమించారు. చిన్నతుంగాం పంచాయితీ కార్యదర్శితో పాటు సంతబొమ్మాళి పంచాయితీ కార్యదర్శిగా ఇన్ఛార్జీ బాధ్యతలు నిర్వహిస్తున్న దుంప శ్రీనివాసరావును పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్ఛార్జీ డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు.

## తైక్వాండో క్రీడాకారులకు వితరణ

**ఇచ్ఛాపురం, ఆగస్టు31 (వార్త):** విశ్రాంత సైనిక ఉద్యోగి ఎల్‌సి రావు తైక్వాండో క్రీడాకారుల కోసం రెండు కొరియన్ ఇరానీ ప్యాడ్లు, మూడు డబుల్ ప్యాడ్స్ డొనేట్ చేశారు. కోచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.




## పోస్టల్ సిబ్బంది సైకిల్ ర్యాలీ




**శ్రీకాకుళం, ఆగస్టు 31 (వార్త):**శ్రీకాకుళం నగరంలోని పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఒత్తిడి స్థాయిని తగ్గించడంలో, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు, శారీరక కార్యకలాపాల ప్రాధాన్యతను పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు వివరించారు. జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29 నుండి పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఒక గంట మైదానంలో ఆడండి అనే థీమ్‌తో ఫిట్ ఇండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత మూడు రోజు లుగా ఫిట్నెస్ ప్రతిజ్ఞ, విద్యార్థులతో చర్చలు వంటి కార్యక్రమాలు చేపట్టిన తపాలా శాఖ ఆదివారం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో పోస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**పలాస, ఆగస్టు 31 (వార్త):** ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాకుపల్లి నాని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఎవ్వారి వైకుంఠ రావును, బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన గన్‌మెన్ తలగాపు శంకరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట ఏపీ ట్రెడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, లోడగల కామేష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రులు ఉత్సవాల నిర్వహణకు పందిరిరాట



**పలాస, ఆగస్టు 31(వార్త):** దుర్గాదేవి శరన్న వరాత్రులు ఉత్సవాల నిర్వహణ కోసం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, 19వ వార్డు పరిధిలో ఉన్న శ్రీ కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద దుర్గాదేవి ఉత్సవాల మండపం నిర్మాణం కోసం ఆదివారం పండితుల వేదమంత్రోత్సవాలు మధ్య పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు శిష్టు గోపీ, జోగ తిరుపతిరావు, కొనారి ఆది, జోగి పవన్, పినమింటి ఎర్ర న్నాయుడు, బోనెల శ్రీకాంత్, రుద్రపంక్తి హేమంత్, బోనెల ప్రకాష్, పొట్టి నరేష్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## 103 పాఠశాలల విద్యార్థులు కలయిక

**పలాస, ఆగస్టు 31(వార్త):** పిలిగ్రిమ్ టు ప్రశాంతినిలయము అనే పేరుతో అఖిల భారతదేశంలో ఉన్న 103 శ్రీ సత్యసాయి పాఠశాల విద్యార్థులు, మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ సుమారు 3000 మంది పుట్టపర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురం నుండి కూడా 32 మంది ఆదివారం హాజరయ్యారు. ప్రశాంతినిలయము, మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె రత్నాకర్‌ను రామకృష్ణపురం ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి కలిశారు. శ్రీ సత్య సాయి విద్యావిహార్ రామకృష్ణపురము స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కిల్లంశెట్టి నారాయణకు వచ్చిన ఆలోచనతో దారము, మేకులు, ప్లేవుడ్ ఉప యోగించి సత్య సాయి స్వామి ముఖచిత్రాన్ని తయారు చేసి మేనేజింగ్ ట్రస్టీకి అందజేశారు.

## విరిగిన చెట్టు కొమ్మ

**జలుమూరు, ఆగస్టు 31(వార్త):**తిమడాం కొమనాపల్లి రహదారి మధ్యలో చెట్టుకొమ్మ విరిగిపడడంతో ఈ రహదారిలో ప్రయాణం చేసే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రహదారిలో చెట్టును తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546